ప్రజాజ్యోతి

వరంగల్

ములుగు,మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ

మంగళవారం 11-11-2025 పేజీలు : 9



వరంగల్ నవంబరు 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జిల్లాలో ఊపందుకున్నాయి. సుమారు 80 శాతం ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని అధికారులు ప్రకటించారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, జిల్లాలో 1,625 మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. 500 ఇళ్లగానూ సుమారు 387 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 310 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగా, మరో 111 ఇళ్లు గోడలు పూర్తి కావస్తున్నాయి. వివిధ దశల్లో ఉన్న వాటికి బిల్లుల చెల్లింపుల్లో కూడా జాప్యం రాకుండా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల్లో ఆఖరి దశ పూర్తి చేసుకొని మరో రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణానికి పూజా కార్యక్రమాలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన 20 శాతం మంది లబ్ధిదారులకు కూడా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో, మురికి వాడల్లో నివసిస్తున్న వారికి చిన్న పాటి స్థలం ఉండడంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ కట్టుకోలేని వారికి ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో ఆనందం వ్యక్తం అవుతోంది.

- నిబంధనల సడలింపుతో ఉత్సాహం
- జీ+1 నిర్మాణాలకు అనుమతి
- లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



# ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

## స్పెషల్ డ్రైవ్ తో దరఖాస్తులను పరిష్కరించండి

**ఈ నెల 13 న కలెక్టరెట్ ఉద్యోగులకు, మీడియా కి మెడికల్ క్యాంపు**

**ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను సందర్శించండి**

**పర్యవేక్షణ నిరంతరం ఉండాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) :

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం సందర్బంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పైన వినతులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వీకరించారు. అనంతరం వివిధ అంశాల మీద జిల్లా అధికారులతో కలెక్టర్ రివ్యూ చేశారు.

మిగతా 6లో...

## ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**కలెక్టర్లతో మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు**




2 లో..

హనుమకొండ 10 నవంబర్ (ప్రజాజ్యోతి) :
2025 వానాకాలం పంట సీజన్ సంబంధించి రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా తో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**కలెక్టర్లతో మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు**




**హనుమకొండ 10 నవంబర్ (ప్రజాజ్యోతి) :** 2025 వానాకాలం పంట సీజన్ సంబంధించి రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా తో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.నీటిపారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం 2025 వానాకాలం పంట కొనుగోలు పై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు , సీఎస్ కే.రామ కృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ…1640 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఓపెన్ చేయలేదని, వీటిని తక్షణమే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోగా చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం రైతులకు కమిట్మెంట్ ఇచ్చిందని, దీనికి అనుగుణంగా వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. కోనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా వేస్తూ అవసరమైన మేర వాహనాలు , ఇతర ఏర్పాట్లు సిద్ధం చేయాలని అన్నారు. దేశం చరిత్ర లోనే మొదటిసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఒకే సీజన్ లో కొనుగోలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, ప్యాడి క్లీనర్లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ…అకాల వర్షాల కారణంగా లక్ష 10 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కట్టుదిట్టంగా జరుగుతూ, రైతులకు కొంత మేర ఉపశమనం లభించేలా పని చేయాలని అన్నారు. తేమ శాతం లేకపోయినా కొనుగోలు చేయాలని డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానం రావడం లేదని అన్నారు.పత్తి, ధాన్యం పంటల ఆర బెట్టుకుని నిర్ణీత తేమశాతం వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వెళ్తే రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని మంత్రి తెలిపారు. రైతులకు సౌకర్యంగా ఉండే విధంగా సమీపంలో గల జిన్నింగ్ మిల్లు కు మ్యాప్ చేసి పత్తి పంట విక్రయం జరిగేలా చూడాలని అన్నారు.సీఎస్ కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ…నవంబర్ నెలలో అధికంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందించాలని సీఎస్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ,పీడీ డిఆర్డీఓ మేన శ్రీను, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎండి వాజిద్ అలీ , వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## "మొంథా" ప్రభావిత ప్రజలకు సహాయం
## ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ సిటీ నవంబర్10, (ప్రజా జ్యోతి):** భారత సేవాశ్రమ సంఘ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతంలోని తుఫాన్ "మొంథా" ప్రభావిత ప్రజలకు సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది.సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బాధితులకు సహాయ వస్తువులు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ మండలం ఎన్ ఎన్ నగర్, మైసయ్య నగర్, వరంగల్ మండలం ఎన్టీఆర్ నగర్, ఎస్సీ కాలనీ , ఎస్ ఆర్ నగర్, ప్రాంతాల్లో తుఫాన్ బాధితులకు భారత సేవాశ్రమ సంఘ్ ద్వారా అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమని తెలిపారు.భారత సేవాశ్రమ సంఘ్ సెక్రటరీ స్వామి మునీశ్వరానంద మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు 1000 టీ షర్ట్స్ , 1000 చీరలు, 1000 ధోతీలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల వేలంపాటలు



**భీమదేవరపల్లి: నవంబర్ 10 ,(ప్రజా జ్యోతి):** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన వీరభద్ర స్వామి జాతర హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర 2026 జనవరిలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రోజున టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి కిషన్ రావు తెలిపారు. ఈ టెండర్లలో పాల్గొనే ఉత్సాహవంతులు తగిన డిపాజిట్లు చెల్లించి టెండర్లో పాల్గొనాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

**భద్రేశ్వరునికి అసంఖ్యాక రుద్రాక్షలతో అభిషేకం**



**హనుమకొండ 10 నవంబర్ (ప్రజాజ్యోతి):** దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, దేవాదాయ శాఖ మంత్రి, కమీషనర్ ఆదేశాల మేరకు శ్రీ భద్రకాళి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం భక్తిపూర్వకంగా నిర్వహించబడింది. భద్రేశ్వర స్వామివారికి అసంఖ్యాక రుద్రాక్షలతో శ్రద్ధాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీత ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం దేవాలయాన్ని సందర్శించిన నారీమణులకు దేవాలయ కార్య నిర్వాహణాధికారి రమల సునీత వైనములు అందజేశారు.ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు శ్రీ లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రుద్రేశ్వర స్వామికి భస్మాభిషేకం



**హనుమకొండ 10 నవంబర్ (ప్రజాజ్యోతి):** చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి వయ్య స్తంభాల దేవాలయంలో కార్తీకమాసం శివ ప్రీతికరమైన మూడవ సోమవారం పురస్కరించుకొని ప్రాత కాలంలో ఉత్తిష్ట గణపతికి నవ రసములతో అభిషేకం నిర్వర్తించి దూర్వాంగ పూజ రుద్రేశ్వర స్వామికి అంగన్యాస కరన్యాసంతో మహాన్యాస పూర్వక ఓంకార శంకనాథ ప్రతిధ్వనిస్తుండగా అగ్ని అగ్ని వీధి పురోహితం అంటూ వేదమంత్ర ఘోష మార్మోగుతుండగా వేరోక్తంగా భక్తుల కోలాహలం మధ్య యాభై ఒక్క కిలోల భస్మంతో భస్మోదూలితాభిషేకం నిర్వహించడం జరిగింది. 200 మంది పుణ్య దంపతులచే సామూహిక రుద్రాభిషేకము నిర్వహించి గజమాలతో రుద్రేశ్వరుని అలంకరించి సప్త హారతులు మరో అద్భుతం వారణాసి నుంచి తెప్పించిన బిల్వ నంది సింహ నాగ రుద్ర కుంభ నక్షత్ర హారతులు విశేషంగా ఇవ్వడం జరిగింది ఇచ్చే సమయంలో ఆలయ ప్రాంగణం అంతా ఓంకారంతో మార్మోగింది ప్రమాదగణాలు తరలివచ్చి మహాదేవుని కి మహానీరాజనం చేస్తున్నారు అనే భావన భక్తులలో కలిగింది నీరాజనం మంత్రపుష్పం అనంతరం భక్తకోటికి తీర్థప్రసాదాలు వితరణ చేయడం జరిగింది సాయంకాల సమయంలో సాంస్కృతి భక్తి విశ్వాసాలకు నిలయమైన కార్తీకంలో దేశభక్తి దైవభక్తి దేశ సంకల్పాలను రాబోయే తరాలకు తెలిసేలా మహిళలు అందరు సామూహికంగా కులాలకు అతీతంగా దీపాలను ప్రకాశింపజేశారు ఈ ప్రకారం కొత్త చేతనోత్సవాన్ని ఇస్తుంది ప్రేరణ అనే కాంతి పుణ్యాలను విడుదలవుతూనే ఉంటుంది ఈ పావన దీపోత్సవం తెలుగు సంస్కృతి విస్తరణ ఈ ఆధ్యాత్మిక భూమిపై నిర్వహించు కుంటున్నాము ఎక్కువ సంఖ్యలో దీపాలు వెలిగించుకోవడం వల్ల తెలుగు సంస్కృతి కూడా వెలుగుతుంది అని దేశానికి అలౌకిక ఆనందాన్ని కలిగిస్తుంది అని కార్తీక పురాణం పేర్కొంటుంది సాయంకాల సమయంలో భజన కార్యక్రమాలు చతుర్వేద పారాయణం నీరాజన మంత్రపుష్పము భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. ఈ ఆలయంలో జరిగిన వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆలయ వేద పండితులు గంగు మణికంఠ శర్మ సందీప్ శర్మ ప్రణవ్ నిర్వర్తించారు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి అనిల్ కుమార్ దేవాలయం సందర్శించిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అనిల్ కుమార్ తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయిని నీలిమ రెడ్డి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్10, (ప్రజా జ్యోతి):** హనుమకొండ నగరంలో ఘనంగా జరిగిన రాజేష్%-%మాధవి దంపతుల కుమార్తె నూతన వస్త్ర, ఫల, పుష్పాలంకరణ వేడుక మరియు డాక్టర్ రమణ కుమారుడి వివాహ వేడుకలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదిస్తూ, వారికి సుఖసంతోషాలతో కూడిన దాంపత్య జీవితం కలగాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):**
ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్జీలు పరిష్కరించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర అన్నారు.సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర,అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జీ,సంపత్ రావు,ఆర్డీఓ వెంకటేష్ లతో కలిసి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడి కక్కడే పరిష్కరించారు. మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.భూ సమస్యలు-07,గృహనిర్మాణ శాఖకు-11,పెన్షన్-10,ఉపాధి కల్పనకు-03,ఇతర శాఖలకు సంబంధించినవి-30 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ త్రాగునీటి సమస్య లు,సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,తహశీల్దార్లు,ఎంపిడిఓలు,కలెక్టరేట్ పరిపాలన అధికారి,కలెక్టరేట్ సూపరింటెండెంట్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపాక గ్రామంలో సాధనాశూరుల ప్రదర్శన

**రేగొండ ప్రజాజ్యోతి నవంబర్ 10:**
తెలంగాణలోని అరుదైన ఆశ్రిత కళాకారుల్లో ఒకరైన సాధనశూరులు సోమవారం రేపాక గ్రామంలో పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రధానమైన కళారూపాలను ప్రదర్శించారు.ఉన్నది లేనట్టు,లేనిది ఉన్నట్టు చూపి కండ్లముందే కనికట్టు చేయడమే వీరి ప్రత్యేకత.రాళ్లను దేవతామూర్తులుగా మార్చి,అవే విగ్రహాలను పసుపు బియ్యంగా,పులిహోరగా మార్చేయడంతో పాటు కాగితాలను,దారాలను కాల్చి తిరిగి సృష్టించడం,రెండు చేతులతో కర్రసాము చేయడం,గుండెలపై రాళ్లు పెట్టుకొని సుత్తితో పగలగొట్టించుకోవడం,తలపై పొయ్యి పెట్టి పూరీలు చేసుకొని తినటం,మంటలో సలసలా కాల్చిన ఇనుప వస్తువులను చేతితో పట్టుకోవడం వంటి ప్రదర్శనలను ప్రజల ముందే చేసి చూపించారు.రెండు గంటల పాటు సాగిన ఈ ప్రదర్శనను ప్రజలంతా ఆసక్తిగా చూస్తూ అవాక్కయ్యారు.తమకు వారసత్వంగా సంక్రమించిన కళ,కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడుతున్నామని, దీనికి తెలుగు ప్రజలంతా అండగా ఉండాలని సాధనాశూరుల పెద్ద మనుషులు గంజి కృష్ణ,గంజి శ్రీహరి,గంజి శ్రీనివాస్,గంజి చక్రపాణిలు,గంజి రంజిత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పద్మశాలి కుల పెద్ద మనుషులు పోరండ్ల రాజయ్య,వెల్దండి యాదగిరి,మాజీ కుల పెద్ద మనుషులు వెంగల కుమార స్వామి,పోరండ్ల సమ్మయ్య తో పాటు పద్మశాలి కులస్తులు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పదవ తరగతి విద్యార్థుల పరీక్షా ఫీజు పూర్తి చెల్లింపు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ నుంచి మోదీ గిఫ్ట్**



**ఎల్కతుర్తి నవంబర్ 10(ప్రజాజ్యోతి):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మోదీ గిఫ్ట్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులందరి పరీక్షా ఫీజును తన వేతన డబ్బుల నుంచే భరించడంతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. సోమవారం రోజున ఎల్కతుర్తి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థుల పరీక్షా ఫీజు మొత్తాన్ని చెల్లించారు.ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి సంబంధిత మొత్తం చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ,కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరి పరీక్షా ఫీజును ఈ ఏడాది పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.ఆ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే లేఖలు పంపినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చాలామంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబాలకు చెందుతారు.పరీక్షా ఫీజుల విషయంలో తల్లిదండ్రులు కష్టాలు పడకూడదనే సంకల్పంతో బండి సంజయ్ ముందుకు వచ్చారు అని చెప్పారు.ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫీజును భరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ఎల్కతుర్తి మండల బీజేపీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

# స్పోర్ట్స్ జోనల్ మీట్‌లో హసన్‌పర్తి గురుకుల విద్యార్థినుల ప్రతిభ



**హసన్‌పర్తి,నవంబర్-10 (ప్రజాజ్యోతి):**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల 11వ జోన్ స్థాయి క్రీడా పోటీలు రాయపర్తిలో నిర్వహించారు. ఈ క్రీడల్లో హసన్‌పర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలను సొంతం చేసుకున్నారు. 600 మీటర్ల పరుగు పందెంలో ఎం. వైష్ణవి స్వర్ణ పతకం సాధించగా, డిస్కస్ త్రోలో రజత పతకం దక్కించుకుంది.200 మీటర్లలో ఎం. శ్రీహర్ష (7 బి) రజత పతకం, 400 మీటర్లలో కాంస్య పతకం పొందింది.ఎం. మణిచందన (7 ఏ) 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది.హైజంప్‌లో ఎం. అనుదీప్తి (7 బి) రజత పతకం తెచ్చుకుంది.3 వేలు నడకలో ఎం. స్రవంతి (2వ ఎంపీసీ) స్వర్ణ పతకంతో మెరిసింది.బాల్ బ్యాడ్మింటన్ లో అండర్ 17 విభాగంలో జే. శరణ్య, వై. శాక్షర, బి. ప్రసన్న (10 బి), నవ్యశ్రీ (9 బి), ఎం. మేఘనశ్రీ (9 బి) తొలి స్థానం సాధించారు.టెన్నికోయిట్‌లో అండర్ 17 జట్టు వై. శాక్షర, జే. శరణ్య ద్వితీయ స్థానం పొందాయి.వాలీబాల్ అండర్ 19 విభాగంలో ఆర్. అంజలి (బైపీసీ రెండవ సంవత్సరం), ఎం. మీనాక్షి (2వ ఎంపీసీ), టీ. ప్రణీత (1వ బైపీసీ), తేజశ్రీ (1వ బైపీసీ), ఏ. శ్రీనిధి (1వ ఎంపీసీ) జట్టు ద్వితీయ స్థానం సాధించింది.చదరంగంలో అండర్ 19 విభాగంలో సి.హెచ్. శివాత్మిక (1వ ఎంపీసీ) తొలి స్థానం, అండర్ 14 విభాగంలో బి. అక్షిత ద్వితీయ స్థానం పొందారు. క్యారంస్లో అండర్ 14 విభాగంలో సి.హెచ్. శ్రీప్రియ, డి. సుచిత్ర (8వ తరగతి) ద్వితీయ బహుమతి సాధించారు.ఈ సందర్భంగా పీడీ పద్మశ్రీ, శారీరక విద్య ఉపాధ్యాయురాలు వసుమతి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి పి. సుధా కృష్ణ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ క్రీడల్లో మెరిసిన విద్యార్థినులు వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి గురుకుల క్రీడల్లో పాల్గొనడానికి ఎంపిక కాబోతున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

# జీలుగుల గ్రామంలో పార్టీలకు అతీతంగా శివాలయ నిర్మాణంగ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు



**ఎల్కతుర్తి నవంబర్ 10 (ప్రజా జ్యోతి):**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జీలుగుల గ్రామంలో పార్టీలకు అతీతంగా శివాలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామస్థుల సహకారంతో 10 లక్షల రూపాయలు సేకరించి ఎండోమెంట్స్ విభాగంలో డిపాజిట్ చేయగా, ప్రభుత్వంచే 40 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి.

మొత్తంగా 50 లక్షల రూపాయలతో శివాలయం నిర్మాణం చేపట్టనున్నట్లు గుడి ట్రస్టీ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.శివాలయం నిర్మాణ బాధ్యతలను ఎండోమెంట్ శాఖకు చెందిన కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ దీపికా రెడ్డి, అసిస్టెంట్ సపతి శివశంకర్, శివాలయ డైరెక్టర్లు,మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు,బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.శివాలయ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమవడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వీధికుక్కల నియంత్రణపై సమావేశం

- సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ
- నగర మేయర్ గుండు సుధారాణి
- అనిమల్ వెల్ఫేర్ బోర్డు నిబంధనలు పాటించాలన్న మేయర్
- ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ అధికారులతో సమావేశం



**వరంగల్ సిటీ, నవంబర్ 10(ప్రజాజ్యోతి):** నగరంలోని జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణం గా కార్యాచరణ (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వీధి కుక్కల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు మేయర్ తగు సూచనలు చేశారు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణంగా నగరంలో జన సమూహ ప్రాంతాలైన పాఠశాలలు, రైల్వే, బస్ స్టేషన్లు, ఆసుపత్రులు, పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏ డబ్ల్యూ బి ఐ)వారి సూచనలను పరిగణలోకి తీసుకొని బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి అలవాటు పడిన ఓ విలేఖరి కథ

**తనదైన శైలిలో వివాదాలకు పాల్పడుతూ వార్తల్లోకి ఎక్కడం ఆ విలేకరి ప్రత్యేకత...!**



**చెన్నారావుపేట నవంబర్10( ప్రజాజ్యోతి):** చెన్నారావుపేట మండలంలో ఇరువురికి జరుగుతున్న భూ వివాదాన్ని అదునుగా తీసుకున్న ఓ విలేఖరి ఇరువురిలో ఒకరితో భూమి ఒప్పందం సెటిల్మెంట్ కుదిరించుకున్నాడు.ఆ విలేఖరి ఎవరు.? తనదైన శైలిలో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తితో కలిసి ఆ విలేఖరి భూమిలో గెట్టు రాళ్లు పాతుతాడు..! పొలంలో గడ్డి మందు కొడతాడు..! మండలంలో పలు వ్యక్తులు వాన్ని ఛీ అన్న తుడుచుకుపోతాడు..! ఎవడు ఆ విలేకరి.? గడ్డి మందు కొట్టడంతో నా పంట కరాబ్ అయిందని ఓ భూమి బాధితుడు పోలీస్ స్టేషన్ ని ఆశ్రయిస్తే అక్కడికి వచ్చిన ఒళ్ళు తెలవని దందాలకు అలవాటు పడిన ఓ విలేకరి పోలీస్ స్టేషన్ అని మరిచి బాధితున్ని బెదిరించిన ఘనత ఆ విలేఖరికే దక్కుతుందా..! రెవెన్యూ ఆఫీసర్లు ఆ భూమిపై సర్వే నిర్వహిస్తే ఆ రెవెన్యూ అధికారుడిని సైతం అలా ఎందుకు చేసావురా మాకు అనుకూలంగా వచ్చేటట్టు ఎందుకు రాయలేదు రా అంటూ బెదిరించే గడ్స్ అన్యాలకు పాల్పడే మెదడు కలగాల ఓ విలేకరి ఎవరు..? ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించే సమాజం ఇప్పుడు లేదు పదిమందిలో చెంప మీద కొడితే సిగ్గుతో జనాలకు మొఖం చూపించలేని సమాజంలో ఉన్నా గాని ఆ విలేఖరికి ఇవన్నీ ఏమి వర్తించవు. నా రూటే సపరేటు నన్నెవటి అంటే ఏంటి అనే ధోరణిలో ఉంటాడు ఆ యొక్క గొప్ప విలేఖరి..! త్వరలో పూర్తి వివరాలతో

# ఓపెన్ పదవ తరగతి,ఇంటర్ అభ్యర్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

**చెన్నారావుపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మానుపాటి పాపమ్మ.**




**చెన్నారావుపేట నవంబర్ 10 (ప్రజా జ్యోతి):** చేన్నారావుపేట మండల కేంద్రము లోని హైస్కూల్ యందు ఉన్న ఓపెన్ స్కూల్ సెంటర్ యందు 10 మరియు 12 తరగతుల అభ్యర్థులకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అక్రిడియేటెడ్ ఇన్స్టిట్యూట్ కో ఆర్డినేటర్ హైస్కూల్ చెన్నరావుపేట ప్రధానోపాధ్యాయులు మానిపాటి పాపమ్మ గారు 2025-2026 సంవత్సరం అభ్యర్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఓపెన్ పది,ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అందరూ బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని అలాగే పాఠశాలలో సెలవు రోజులలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పోలేపల్లి రవి,ఉపాధ్యాయులు వేముల కిషోర్,శ్రీనివాస్ రెడ్డి,మంజుల సిబ్బంది రాజశేఖర్,సునీల్, సీఆర్ పి సంపత్ మరియు సీసీ మంజుల,వి. ఓ.ఏ.ఆమని,అభ్యర్థులు సరిత,స్వర్ణలత,జ్యోతి,హేమలత,ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కన్నాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ

-నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటాం

-డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్



**కన్నాయిగూడెం, నవంబర్ 10(ప్రజా జ్యోతి):** కన్నాయిగూడెం మండలంలో పాము కాటుతో బాలుడి మృతి సంఘటనపై ప్రాథమిక విచారణ చేయడానికి ఏటూరు నాగారం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ గిరి ఎం సి హెచ్ మెడికల్ ఆఫీసర్ తో కలిసి కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజిట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఓపి మరియు ఇన్ పేషంట్ సేవలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని మందుల స్టాక్,స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఎమర్జెన్సీ డ్రగ్ స్టాక్ మరియు ఎక్స్పైరీ డేట్ లను పరిశీలించారు. అందుబాటులో ఉన్న పాము కాటుకు ఉపయోగించే ఆంటీ స్నేక్ వీనం ఇంజక్షన్స్ క్వాండిటీ మరియు ఎక్స్పైరీ డేట్ పరిశీలన చేసారు. పీహెచ్సీ స్టాఫ్ ను విచారించి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శారద, స్టాఫ్ నర్స్ ప్రశాంతి, సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రముఖ కవి అందెశ్రీ కి బోజేర్వు ఎంపీ యుపి ఎస్ పాఠశాల నివాళి

**చెన్నారావుపేట నవంబర్ 10 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ రచయిత, ప్రముఖ కవి, పద్మశ్రీ అందెశ్రీ మరణించిన విషయం తెలుసుకుని, స్థానిక బోజేర్వు ఎంపీ యుపి ఎస్ పాఠశాల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా, పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏర్ర రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. మొదటగా, అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అందెశ్రీ కేవలం ఒక కవి మాత్రమే కాదు, మన సంస్కృతి, భాష పట్ల అపారమైన ప్రేమను పెంచిన గొప్ప వ్యక్తి. ఆయన రచించిన 'జయ జయహే తెలంగాణ' పాట ప్రతి విద్యార్థికి స్ఫూర్తినిస్తుంది. వారి ఆకస్మిక మరణం సాహిత్య లోకానికి తీరని లోటు అని అన్నారు.విద్యార్థులు కూడా అందెశ్రీ పాటలను గుర్తు చేసుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పాఠశాల తరపున నివాళులు అర్పించడం ద్వారా, గొప్ప వ్యక్తుల జీవితం మరియు వారి సేవలను గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్ రమేష్ రాజు శ్వేతా శ్రీ లు పాల్గొన్నారు.



## మండలంలో ట్రైనింగ్ ఐఏఎస్‌ల పర్యటన



**మహాముత్తారం,నవంబర్ 10. ప్రజాజ్యోతిః** ములుగుపల్లి గ్రామపంచాయతీలో క్షేత్రస్థాయి పర్యటనకు యుపిఎస్సి ద్వారా ఎంపికైన ఆరుగురు ఆఫీసర్ ట్రైనింగ్ ఆఫీసర్స్ అనురాగ్ రంజాన్ వటస్ రాజ్ కృష్ణ విపాషన తన్వస్ కృష్ణ విశేష్ సింగ్ తుషార్ సింగ్ పర్యటించారు.మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ములుగుపల్లి గ్రామ పంచాయతీకి వచ్చిన వీరికి మండల స్థాయి అధికారులు మరియు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ ప్రజలతో మాట్లాడుతూ వివిధ విషయాలు తెలుసుకున్నారు. ప్రైమరీ స్కూల్ మరియు అంగన్వాడి సెంటర్ ని సందర్శించారు.ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపీడీఓ నిషంత్ కార్యదర్శి లక్ష్మీ మాజీ ప్రజా ప్రతినిధులు మరియు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందేశ్రీ మరణం సాహితీ రంగానికి తీరని లోటు

**మాచర్ల ప్రభాకర్**



**రాయపర్తి, నవంబర్ 10 ప్రజా జ్యోతిః** అందెశ్రీ మరణం సాహితీ రంగానికి తీరని లోటని మాజీ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాచర్ల ప్రభాకర్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రాసిన గీతం ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, అందరినీ ఒక్కతాటి మీదకు తీసుకువచ్చిందన్నారు. ఆయన సాహితీ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ ప్రకటించిన రోజున అందెశ్రీ కళ్లలో కనిపించిన ఆనందం, ఉద్విగ్నత నేటికీ తారసపడుతోందన్నారు.సాహితీవనంలో మహావటవృక్షంకూలిపోయినంత బాధ ఈ రోజు మనందరిదని, ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆ భగవంతుణ్ని వేడుకుంటున్నట్టు తెలిపారు.

## నిబంధనలను పాటించని వాహనదారులకు జరిమాన

**వరంగల్ సిటీ, నవంబర్ 10(ప్రజాజ్యోతి):**వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు పాటించకుండా పట్టుబడ్డ ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ సిఐ సుజాత తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 08 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కే లక్ష్మీనారాయణ సోమవారం 3200 రూపాయలు జరిమాన విధించినారు. మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 82 మందికి 85,500 రూపాయల జరిమాన విధించారని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని ట్రాఫిక్ సిఐ సుజాత తెలిపారు.



## సుల్తాన్ పూర్-కోనరావుపేట రోడ్డు పూర్తి చేయాలని కోరుతున్న మండల ప్రజలు



**ప్రజాజ్యోతి కొత్తపల్లి గోరి నవంబర్ 10ః** సుల్తాన్ పూర్ – కోనరావుపేట రహదారి గుండా ప్రజలు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొన్ని రెండు నెలల్లో సమ్మక్క సారక్క జాతర జరగనుంది ఆ జాతరకి వెళ్లి తిరుగు ప్రయాణంలో వచ్చే భక్తులకు పాండవుల గుట్టను సందర్శించడానికి అనువుగా ఉంటుంది. కావున ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించి రహదారి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అందే శ్రీ చిత్ర పటానికి నివాళులు అర్పించిన కళాకారులు



**రఘునాథపల్లి, నవంబర్ 10(ప్రజాజ్యోతి)ః** రఘునాథపల్లి మండలంలో అందెశ్రీ చిత్రపటానికి తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సంస్కృతిక ఉద్యమ పాటలను గుర్తు చేసుకున్నారు. సామాజిక గేయాలు ఉద్యమ గేయాలు ప్రకృతి గేయాలు సినిమా గేయాల రాయడం లో అందెశ్రీ కి ఎవరు సాటిలేరు అన్నారు.లాలపేట లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్లో తన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.తన పాటలు సమాజాన్ని మార్పు లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం లో ప్రముఖ పాత్రను పోషించాయి.ఈ కార్యక్రమంలో వెల్ది మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్, కల్పకూరి హరినాథ్, రాసమల్ల మల్లేష్,జీడికంటి శ్రీనివాస్, నీలం భాస్కర్,గొంగళ్ళ కుమార్, సింగపురం అఖిల్, మాటూరి శివ తదితరులు పాల్గొన్నారు.

## "వాసవి మీడియా రత్న" అవార్డు అందుకున్న దివ్వెల పూర్ణచందర్



**వరంగల్ సిటీ, నవంబర్10(ప్రజాజ్యోతి):** నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దివ్వెల పూర్ణచందర్ "వాసవి మీడియా రత్న 2025" అవార్డు అందుకున్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఆర్యవైశ్య జర్నలిస్టులను "కలం యోధులకు అభినందన మందార మాల" పేరిట ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్ లోని వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, వీసీఐ అంతర్జాతీయ అధ్యక్షులు యిరుకుల్ల రామకృష్ణ చేతుల మీదుగా దివ్వెల పూర్ణచందర్ అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు దోసపాటి వెంకటేశ్వరరావు, సిద్ద సూర్యప్రకాష్ రావు, బోడ సూర్యప్రకాష్, గార్లపాటి శ్రీనివాసులు, సుజాత రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ అంజయ్య, డబ్ల్యుజెఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా దివ్వెల పూర్ణచందర్ గత 30 సంవత్సరాలుగా పత్రికా రంగంలో పని చేస్తూ, వివిధ సేవా సంస్థల్లో కీలకంగా వ్యవహరించడమే గాక సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. అవార్డు అందుకున్న దివ్వెల పూర్ణను వాసవిక్లబ్ వరంగల్ సెంట్రల్, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి వరంగల్, ఆవోపా కాకతీయ, ధరణీసాయి సేవాసంఘ్, శ్రీ వెంగమాంబ సేవాసమితి ప్రతినిధులు అభినందించారు.

## వైద్య పరీక్షల రికార్డులను ఆన్ లైన్ చేయాలి

**- డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈ. అనిల్ కుమార్**



**వరంగల్ సిటీ, నవంబర్ 10(ప్రజాజ్యోతి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాలతో డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్ లో పర్యటించారు. అసంక్రమిత వ్యాధుల, ల్యాబ్ టెస్టుల రికార్డులను పరిశీలించి ప్రతి రికార్డులను అప్డేట్ చేసి ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం పుప్పాలగుట్ట ప్రాంతంలో ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలతో ఇంటింటి సర్వేలో పాల్గొని గర్భిణీ స్త్రీల నమోదు, అసంక్రమిత వ్యాధుల నమోదు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ప్రజలను వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకొని వ్యాధులకు గురికాకుండా ఉండాలని తెలిపినారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచించే సూచనలలో భాగంగా డ్రై డేను తప్పనిసరిగా పాటించి దోమలు పెరగకుండా చూడాలని ముఖ్యంగా డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా సహకరించాలని కోరినారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్న వైద్య సిబ్బంది ద్వారా తగిన పరీక్షలు, చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్ వైద్యాధికారి డాక్టర్ దిలీప్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్ తో దరఖాస్తు లను పరిష్కరించండి

**ఈ నెల 13 న కలెక్టరేట్ ఉద్యోగులకు, మీడియా కి మెడికల్ క్యాంపు**

**ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను సందర్శించండి**

**పర్యవేక్షణ నిరంతరం ఉండాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) :** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పైన వినతులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వీకరించారు. అనంతరం వివిధ అంశాల మీద జిల్లా అధికారులతో కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ లోని ఉద్యోగులందరికి, ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా వారికి కలెక్టరేట్ లో మెడికల్ క్యాంపు నిర్వహణ ఉంటుందని దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, తహసీల్దార్ లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సజావుగా కొనుగోళ్లు జరగడంతో పాటు అన్ని రిజిస్టర్ ల నిర్వహణ సవ్యంగా ఉండేలా చూడాలన్నారు. మండల స్పెషల్ అధికారులు వారి పరిధిలో గల పాఠశాలలను, అన్ని సంక్షేమశాఖ ల అధికారులు వారికి సంబందించిన హాస్టల్ లను సందర్శించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. చలి తీవ్రత మొదలైన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. దిశ్బాచి కార్యక్రమంలో భాగంగా మొదలుపెట్టిన మెడికల్ క్యాంపులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా వచ్చిన ఎంపీడీఓ లకు ఇందిరమ్మ ఇల్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి, వివిధ శాఖల కు చెందిన అంశాల మీద వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ట్రైని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తేజస్విని, డిఆర్డీవో పీడీ వసంత, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఎలుకల మందు తాగి మహిళ సూసైడ్



**వెంకటాపూర్ నవంబర్ 10 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామంలో ఎలుకల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది.ములుగు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరకుంటపల్లి గ్రామానికి చెందిన గోపు భద్రయ్య కుమార్తెను నర్సాపూర్ గ్రామానికి చెందిన అటికె పరమేష్ కు ఇచ్చి వివాహం చేశాడు.కాగా అటికె దివ్య తన పిల్లలకు హోం వర్క్ సరిగ్గా చేపించలేదని మందలించడం జరిగిందని, అనంతరం భర్త పని నిమిత్తం బయటకు వెళ్లగా దివ్య ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది.భర్త అటికే పరమేష్ కు విషయం తెలుపడంతో ములుగు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్సై తెలిపారు.దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. కాగా మృతురాలి తండ్రి గోపు భద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.

## రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్**



**నల్లబెల్లి/ నవంబర్10( ప్రజా జ్యోతి):** రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వరి ధాన్యం కొనుగోలు పై రైతులు ఆందోళన చెందవద్దని నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏపీఎం సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పూర్తి భరోసా ఇస్తోందని, రైతులు చెమటోడ్చి పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.రైతుల ధాన్య కొనుగోలు వ్యవహారాలు పారదర్శకంగా ఉండేలా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ధాన్యం అమ్మకాల తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా, సమయానికి రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, ధాన్యం తూకం నుంచి రవాణా, నిల్వ వరకు ప్రభుత్వం పర్యవేక్షణ చేస్తుందన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. రైతుల కోసం అనేక పథకాలు అమలవుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. సంబంధిత అధికారులు అన్ని ఫార్మాలిటీలను వేగంగా పూర్తి చేస్తారు అని స్పష్టం చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఎంపీడీవో శుభనివాస్, ఏవో రజిత బన్ని, డీఆర్డీఓ రేణుకా దేవి. ఎస్సై లక్ష్మణ్ రెడ్డి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి. మండల నాయకులు మాలోతు రమేష్. జిల్లా మునీందర్. ఇస్తారు శేఖర్ గౌడ్. వైనాల అశోక్. చిట్యాల ఉపేందర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం అందజేసిన పోరెడ్డి మల్లారెడ్డి



**లింగాల గణపురం, నవంబర్, 10 (ప్రజాజ్యోతి):** మండలంలోని జీడికల్ గ్రామంలోని వీరాచల రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి లక్ష రూపాయలు విరాళం వివో వంశీకి అందజేశారు. పోరెడ్డి మల్లారెడ్డి అభినందించిన స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## అందెశ్రీ మరణం సాహితీ రంగానికి తీరని లోటు

**టియుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్**



**మల్హర్, నవంబర్ 10 ప్రజాజ్యోతి :** అందెశ్రీ ఆకస్మిక మరణం తెలంగాణ రాష్ట్ర సాహితీ రంగానికి తీరని లోటని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (టియూఎఫ్) భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ అన్నారు. సోమవారం అందెశ్రీ మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి నివాళు లర్పించారు. ?తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి పూడ్చలేనిదని జన జాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి అంటు అందెశ్రీ తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తన పాటలతో ఉధృతం చేసి రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్ర మరువలేనిదని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

**.ఎస్టి కోటాలో ఎంపికైన లబ్ధిదారులు**

**ఖానాపూర్, నవంబర్: 10 (ప్రజా జ్యోతి):** ఖానాపూర్ మండలం నాజీ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుడి తండాలో సోమవారం నూతన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్టి కోటాలో మంజూరైన లబ్ధిదారు గుగులోతు సునీత వీరన్న దంపతుల గృహ నిర్మాణ భూమి పూజ లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరుస్తుందన్నారు. నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, మాజీ ఎంపిటీసీ మూడు పూల్ సింగ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ మోహన్, పంచాయతీ కార్యదర్శి బాలు,నాయకులు సురేష్, అనిల్,కోటి, రాంజీ, దేవా తదితరులున్నారు.



# ప్రజల సమస్యలను అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ జిల్లా కలెక్టరేట్నవంబర్ (ప్రజా జ్యోతి):**
సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిడబ్ల్యూ ఓ రాజమణి, లతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల ప్రజలు నుండి వినతులు స్వీకరించారు.ప్రజల సమస్యలను కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించ గలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తు దారులకు లిఖిత పూర్వకంగా తెలుపుతూ సరైన సూచనలు అందించాలని తెలిపారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించగా, అందులో భూ సమస్యలు 45, గృహ నిర్మాణ శాఖకు 15, కలెక్టరేట్ 15, జిడబ్ల్యూ ఎంసీ 8, పోలీసు శాఖ 6 ఇతర శాఖలకు సంబంధించినవి 76 దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల సందర్శనలో విద్య తో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా పర్య వేక్షించాలన్నారు. అలాగే, పాఠశాలల్లో శుభ్రత, తాగునీటి సౌకర్యాలు మరియు హాస్టల్ వాతావరణం మెరుగుపర్చే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడంలో స్ఫూర్తి కార్యక్రమం జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్న నేపథ్యం లో ఈ నెల 13 వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు, సంబంధిత అధికారులుపాల్గొనివిద్యార్థులమానసికదృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి గణపతి, ఆర్డీఓ ఉమారాణి, వివిధ జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ రచయిత అందెశ్రీ మృతి తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు

**ఉకల్ పాఠశాల లో నివాళులు అర్పించిన విద్యార్థిని విద్యార్థులు**

**రాయపర్తి నవంబర్ 10 ప్రజా జ్యోతిః**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్ గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ రచయిత తెలంగాణ రాష్ట్ర గీతం మరియు ఉద్యమం,సినిమా పాటలు రచించిన డా. అందె శ్రీ సోమవారం అనారోగ్యంతో ఉదయం తుధీశ్వాస విడిచారు వారి ఆత్మకి శాంతి చేకూరాలని కోరుతూ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పిస్తు మౌనం పాటించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీరాముల మురళీ మనోహర్, గొల్లపల్లి సదా శ్రీను ,బుర్ర రామూర్తి, డీకొండ సంతోష్, బండపెల్లి సిద్ధార్థ, బండారి రాజు మరియు పాటశాల హెడ్ మాస్టర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగినది.



# డాక్టర్ కవి అందేశ్రీ మరణం పట్ల సంతాపం తెలియజేసిన

**బీసీ జేఏసీ,మాజీ ప్రజాప్రతినిధులు**

**గణపురం ప్రజాజ్యోతి నవంబర్10ః**
గణపురం మండల కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జయ జయహే తెలంగాణ పాటతో తెలంగాణ కీర్తి ప్రపంచానికి చాటిన అందెశ్రీ గొంతు మూగ బోయింది అందెశ్రీ తుది శ్వాస విడవడం జరిగింది గణపురం మండల కేంద్రంలో వారిని గుర్తు చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మండల అధ్యక్షులు బత్తిని శంకర్ గౌడ్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి జిల్లా జేఏసీ కో కన్వీనర్ పోతర్ల మల్లికార్జున్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేపాక రాజేందర్ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోతే కర్ణాకర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి మోటపోతుల శంకర్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలసాని నరసింగరావు పంచాయతీ కార్యదర్శి ఉమ్మల విజేందర్ ఎంపిటిసి అశోక్ రెడ్డి



అంబేద్కర్ సంఘము అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ మాజీ సర్పంచ్ గంధం సుధాకర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆరు ముళ్ళ ఎల్ల స్వామి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎలకపల్లి రమేష్ కొయ్యల శంకర్ గౌడ్ దూడపాక శ్రీనివాస్ ఇంజపెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్ళకు కార్తీక సోమవార శోభ

**గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం**

**స్వామివారికి, భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించిన సిఐ దంపతులు**

**పట్టు వస్త్రాలతో గణపేశ్వరునికి ప్రత్యేక అలంకరణ**



**గణపురం ప్రజాజ్యోతి నవంబర్10ః**
గణపురం మండల కేంద్రం లోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ కు కార్తిక సోమవారం శోభ సంతరించుకుంది. సోమవార పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా భూపాలపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, లక్ష్మి దంపతులు గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి భవాని మాతకు పట్టు వస్త్రాలు చీరే సారే సమర్పించారు. అనంతరం స్వామివారిని కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి దీపదానాలు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం అర్చకులు నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.



# చిన్న నీటి పారుదల వివరాల గణాంక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



**జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) :**
చిన్న నీటిపారుదల గణాంక వివరాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫెరెన్స్ హల్ లో 7వ చిన్న నీటి పారుదల గణాంక నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న నీటిపారుదల కింద వచ్చే సహజ, మానవ నిర్మిత బోరుబావులు చెరువులు, కుంటలు, కాలువలు తదితర వివరాలన్నింటిని పకడ్బందీగా సేకరించాలని అన్నారు. ఈ సర్వే నిర్వహణ కొరకు గ్రామీణ స్థాయిలో జిపిఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈఓ లు, పంచాయతీ కార్యదర్శులను ఎన్యుమరేటర్లుగా నియమించాలని అన్నారు. వివరాల నమోదుకు సంబంధించి నిర్దేశించిన అప్లికేషన్ గురించి సర్వే అధికారులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని వివరించారు. చిన్న నీటిపారుదల వివరాలన్నింటినీ ఖచ్చితత్వంతో నమోదు చేయాలని తహశీల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి చిన కోట్యా నాయక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకొని మద్దతు ధరను పొందాలి

**-ఏ ఎం సి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి**



**రాయపర్తి నవంబర్ 10 ప్రజా జ్యోతిః**
రైతులు తాము ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం పంటలను కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకుని వరికి మద్దతు ధరను పొందాలని వర్ధన్నపేట ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రాయపర్తి మండలంలోని గన్నారం, రాయపర్తి గ్రామాలలో ప్రభుత్వం ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోననే విక్రయించి వరికి మద్దత్తు ధరను పొందాలని అన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు. నిర్వాహకులు ధాన్యాన్ని తీసుకుని రాగానే ప్యాడి క్లీనర్ ద్వారా క్లీన్ చేసి తాలూ, రాళ్ళు,రప్పలు,మట్టిపపేల్లలులేకుండాచూసుకొనివిక్రయించుకోవాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం 2389 రూపాయలను చెల్లిస్తున్నదని, బి గ్రేడ్ ధాన్యానికి 2369 రూపాయలు చెల్లిస్తుందని, సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్ కూడా చెల్లిస్తామని అన్నారు. ధాన్యం ఆరబోసిన తర్వాత శుభ్రంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే 17% లోపు తేమ ఉండేలా చూసుకొని తీసుకురావాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నదని అన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నదని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ధాన్యం కాంటాలు కాగానే 48 గంటలలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యా నాయక్, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, దామోదర్, గోవర్ధన్ రెడ్డి, కోటేశ్వర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మచ్చ రమేష్, ఏపిఎం రవీందర్, సీసీలు రైతులు ఐకెపి మహిళా సంఘాల నాయకులు తది తరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో దేవాదాయ శాఖ రెవిన్యూ ఇన్స్పెక్టర్ కవిత పూజలు

**గణపురం ప్రజాజ్యోతి నవంబర్10ః**
ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల లో కార్తీక సోమవారం దేవాదాయ శాఖ రెవెన్యూ ఇన్స్పెక్టర్ నందనం కవిత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. పూజా కార్యక్రమాల అనంతరం వారిని శాలువాలు పూలమాలలతోఅర్చకులు నాగరాజు ఘనంగా సన్మానించారు.



# వరంగల్ ఎఫ్డిఓ ను కలిసిన మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు

**రాయపర్తి నవంబర్ 10 ప్రజా జ్యోతిః**
రాయపర్తి మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో వరంగల్ ఎఫ్డిఓ పిల్లి శ్రీపతి ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిశాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయపర్తి మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు పిల్లి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి చెవు యాకయ్య, ఉప సర్పంచ్, పూజారి సంతోష్, సొసైటీ బాడీ మెంబర్లు ముద్రబోయిన వెంకన్న, పూజారి రాజసాగర్, పిల్లి మహేందర్, పూస ప్రభాకర్, గాలి రాజు, సోడెపు శ్రీనివాస్, తదితరులు కలిసి ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ ని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాలు బలోపేతంగా ఉండాలని , సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.



# కొమురం భీమ్ నగర్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

**-కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు**

**ఏటూరు నాగారం నవంబర్ 10 ప్రజా జ్యోతి ః**
మండలంలో నీ కొమురం భీమ్ నగర్ జీడివాగు గ్రామస్తులతో సమావేశమై గ్రామ సమస్యలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అడిగి తెలుసుకున్నారు.ఏమైన సమస్యలు ఉంటే మంత్రివర్యులు సీతక్క దృష్టికి తీసుకుళ్ళి పరిష్కరిస్తామన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తెలపండి పరిస్కారానికి వెంటనే కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉండి పరిస్కరిస్తామన్నారు ఈ కార్యక్రమంలో



కొమురం భీం గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి చెకుముకి పోస్టర్ 2025ఆవిష్కరణ



**ఏటూరు నాగారం నవంబర్ 10 ప్రజా జ్యోతిః**
మండల కేంద్రంలోనీ స్థానిక జెడ్పి హెచ్ ఎస్ ఏటూరునాగారం పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా అధ్యక్షులు కొయ్యడ మల్లయ్య ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా కన్వీనర్ పల్లె నాగరాజు తో కలిసి " చెకుముకి సైన్స్ సంబురాలు -2025 " పోస్టర్ లను ఆవిష్కరించారు, ఈ సందర్బంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కొయ్యడ మల్లయ్య విద్యార్థులనుద్దేశించి, విద్యార్థుల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం సైన్స్ ఉపయోగ పడుతుందని, భవిష్యత్తు అంత సైన్స్ పైనే ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరు సైంటిఫిక్ టెంపర్ అలవారుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె రాజన్న, శ్రావణ్ కుమార్, సుమన్, రాజు, సూర్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం లో జిల్లాగ్రంధాలయం చేర్మెన్ పూజలు

**కాళేశ్వరం, నవంబర్ 10.ప్రజాజ్యోతి.**కార్తీకమాసం సందర్బంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వరస్వామివారి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంధాలయ చేర్మెన్ కోట రాజబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఆలయం ముందుకు రాగానే ఆలయ అర్చకులు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.అనుబంధ ఆలయం లో అమ్మవారికి పూజలు నిర్వహించారు.అనంతరం చేర్మెన్ దంపతులకు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు. వారితో పాటు మహాదేవపూర్ సింగిల్ విండో చేర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# అంగరంగ వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం

**కళ్యాణానికి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కడియం**

**లింగాల గణపురం, నవంబర్, 10 (ప్రజాజ్యోతి)ః**మండలం లో నీ జీడికల్ గ్రామంలోని శ్రీ రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన స్వామి వారి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీ రామచంద్ర స్వామి వారి కళ్యాణ వేడుకకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణన్ని విక్షించేందుకు అశేషంగా తరలివచ్చిన భక్తులు ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించిన వసతుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడికల్ శ్రీ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత 2ఏళ్లలో ఆలయ అభివృద్ధికి కోటి 10లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే జనగామ నుండి జీడికల్ వరకు 8కోట్ల 30లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు, శ్రీరామ నవమి నాటికీ ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి కోసం 5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆమోదం రాగానే ఆలయ అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ఆలయం ప్రాశస్త్యాన్ని గుర్తించి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. ఇప్పటికే నా పిలుపు మేరకు కొంత మంది దాతలు విరాళాలు అందజేశారని తెలిపారు. దాతలు ఇచ్చే విరాళాలు ఆలయ అభివృద్ధికి మాత్రమే వినియోగించబడతాయాన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దు

**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ప్రజావాణికి 86 దరఖాస్తులు**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధినవంబర్ – 10 (ప్రజా జ్యోతి):**
ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్ లో పెట్టవద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీపృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.మొత్తం 86 అర్జీలు రాగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులు ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని పెండింగ్ పెట్టవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇతర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు పరిశీలించాలని సూచించారు. రెవెన్యూ కు 30 , డీఆర్డీఓ కు 14 , హౌసింగ్ కు 13, డీపీఓ కు 8 , ఎస్డీసీ, డీఎంహెచ్ఓ, ఉపాధి కల్పన అధికారికి మూడు చొప్పున, సెస్, డీఏఓకు రెండు చొప్పున, డీసీఎస్ఓ, డీఈఓ, ఏడీ సర్వే, ఎక్సైజ్, జిల్లా రిజిస్ట్రార్, డీవీహెచ్ఓ, గిరిజన సంక్షేమ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి పట్ల పోలాడి దిగ్భ్రాంతి

**మానకొండూర్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి):** ప్రముఖ కవి డాక్టర్ అందె శ్రీ మృతి పట్ల రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో కవిగా తన పాటలతో, సాహిత్యంతో కీలక పాత్ర పోషించిన తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణ సృష్టి కర్త అందె శ్రీ మృతి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తీరని లోటని యావత్ తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర దిగ్భ్రాంతికి కి గురి చేసిందని అన్నారు.ప్రముఖ కవి డాక్టర్ అందె శ్రీ తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని జయ జయ హే తెలంగాణ గేయ రూపంలో రచించిన గీతం యావత్ తెలంగాణ ప్రజల్లో చిరస్థాయి గా ఉంటుందని నివాళులు అర్పిస్తూ అందెశ్రీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ దుఃఖ సాగరంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ప్రజా సంఘాల తరపున, నా తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పోలాడి రామారావు ప్రకటించారు. హైదరబాద్ ట్యాంక్ బండ్ పై అందెశ్రీ జ్ఞాపకార్థం తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ లో స్మృతి వనం నిర్మించి నిలువెత్తు విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోలాడి రామారావు విజ్ఞప్తి చేశారు.



## నాటు సార తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ద్విచక్ర వాహనం సీజ్**

**ముస్తాబాద్: నవంబర్ 10 ( ప్రజా జ్యోతి):** ముస్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించి కొంత మంది వ్యక్తులు గుడుంబా తరలిస్తున్నార సమాచారం మేరకు రూట్ వాచ్ నిర్వహించి ఒక ద్విచక్ర వాహనాన్ని పట్టుకోవడం జరిగింది దాన్లో తరలిస్తున్న ఐదు లీటర్ల నాటు సారాయి మరియు ద్విచక్ర వాహనం ను సీజ్ చేసి నాటు సారా తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు, ఈ దాడులలో సిబ్బంది రాజు రాజేందర్ మల్లేష్ కిషోర్ లలిత భవాని వర్మ పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్పించాలి

**-తెలంగాణ ఉద్యమ తరహాలో, బీసీ రిజర్వేషన్ల ఉద్యమం**

**-వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్10, (ప్రజా జ్యోతి):**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పురుడు పోసుకున్న కాకతీయ యూనివర్సిటీ గడ్డ మీద మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్పించి, బీసీలకు సత్వర న్యాయం చేయాలని, మేమేంతో మాకంతా వాటా అంటూ ధర్మంగా పోరాడుతున్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని ఎస్డీఎల్సీ ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ కాకతీయ యూనివర్సిటీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ, బీసీ విద్యార్థులు ధర్మదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ధర్మదీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీ కులస్తులకు రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి, అగ్రవర్ణ రాజకీయ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలు గాను, ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలిపోయారన్నారు. దేశంలో అన్ని వర్గాల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే, కేవలం బీసీలకు మాత్రం రిజర్వేషన్లు లేని కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా అణచివేతకు గురి చేయబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థులు చేస్తున్న ధర్మదీక్షతోనైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లను కల్పించేందుకు ముందుకు రావాలని, లేనియెడల ఉద్యమాన్ని గ్రామస్థాయి నుండి పటిష్టం చేసి, గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట పట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. కేయూ పాలకమండలి సభ్యులు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా. చిర్ర రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంతానికి పోయి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును అడ్డుకొని బీసీలకు అన్యాయం చేయొద్దని, బీసీ రిజర్వేషన్లను కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పేరు వస్తుందని, బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలలోని నాయకులంతా పార్టీలకతీతంగా బీసీ ఉద్యమంలో కలిసి రాకపోతే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కొందరు అగ్రవర్ణ పార్టీలకు తలొగ్గిన నేతలు బీసీ ఉద్యమాన్ని నీరు కార్చేందుకు కుట్రలు చేస్తున్నారని, వారిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థులు రిజర్వేషన్లను సాధించేందుకు పోరుబాట పట్టారని, వారి పోరాటం ఉగ్రరూపం దాల్చకముందే కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్మదీక్షను తెలుగు డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి మామిడి లింగయ్య నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు బక్కి అవినాష్, ప్రొఫెసర్లు మండ సారంగపాణి, శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాస్, సంఘాని మల్లేశ్వర్, కృష్ణ యాదవ్, సంకినేని వెంకన్న, రమేష్, బీసీ విద్యార్థి నాయకులు సుమన్, అజయ్, గణేష్, రాజశేఖర్, రాజ్ కుమార్, నితిన్, సంజీవ్, రాజేష్, అనిల్, వినోద్, సాయి కృష్ణ, మహేష్, నాగరాజ్ యాదవ్, నాగరాజు పటేల్, చిర్ర సుమన్, వేముల మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మహా రుద్ర యాగశాలను పరిశీలించిన అధికారులు



**పరకాల,నవంబర్10, (ప్రజా జ్యోతి):**పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో ఈనెల 17న జరుగు మహా రుద్ర యాగశాలను సోమవారం పరకాల ఆర్డీఓ డా.నారాయణ, పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ట్రైనింగ్ కలెక్టర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ యాగశాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. యాగశాల పనులను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గందె రవి, కోశాధికారి తోట భద్రయ్య, పరకాల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్,ప తదితరులు పాల్గొన్నారు.

